తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం

**అసంతృప్తులను సరిచేసి, పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం**
**గడప గడపకు మన ప్రభుత్వం...బృహత్తర కార్యక్రమం**
**మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులరెడ్డి**



తిరుపతిరూరల్, జనవరి 5 ప్రభాతవార్త:

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని సంస్థాగతం బలోపేతం చేయటానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, తిరుపతి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లా సమన్వయకర్తగా పార్టీ తనను నియమించిందని, అసంతృప్తులను సరి చేసి, ఎమ్మెల్యేలను బలోపేతం చేయడానికి పరిశీలకులను పార్టీ నియమించిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహిస్తాం. సత్యవేడు, గూడూరు, సుళ్ళూరుపేట నియోజకవర్గాలలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయ కన్వీనర్ల నియామకం జరుగుతుంది, 6 నుంచి 20లోపు రథ సారథులను నియమించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చేపడుతున్న పథకాలను గడప గడపకు కార్యక్రమంలో ప్రజలకు వివరించడం జరుగుతుంది. గడప గడపకు కార్యక్రమం బృహత్తర కార్యక్రమం అని అన్నారు. సచివాలయాల ద్వారా సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. గడప గడప కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే గ్రాఫ్ కూడా పెరిగిందన్నారు. మూడు జిల్లాలలో అన్ని సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేసారు. చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల గ్రాడ్యుయేట్ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఇప్పటివరకు 3లక్షల 83వేల ఓట్లు నమోదైనట్లు తెలిపారు. సి.యం. జగన్ వెన్నంటే ఉండే శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైకాపా విధి విధానాలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి నెల జిల్లా అధ్యక్షులతో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

**తిరుపతి జిల్లాలో 7 నియోజకవర్గాలను గెలిపిస్తా...**
జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

తిరుపతి జిల్లాలోని 7 నియోజకవర్గాలలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా పని చేస్తానని వైకాపా తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేసారు. రీజనల్ కో-ఆర్డినేటర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. పటిష్టంగా ఉన్న పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం. ఎక్కడైన సమస్యలు ఉంటే పరిష్కరించి ముందు కెళ్తాం. తిరుపతి జిల్లా అధ్యక్షుడుగానే కాకుండా వెంకటగిరి బాధ్యతలను తనకు ముఖ్యమంత్రి అప్పగించారని, ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు.

**చంద్రబాబు ఓ వీధి రౌడీలా వ్యవహరిస్తున్నాడు : మంత్రి రోజా**

రాష్ట్ర ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ఓ వీధి రౌడీలా వ్యవహరిస్తున్నాడని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్కే రోజా ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహాన్‌రెడ్డిని సైకో, ఉన్మాది అనడం బాధాకరం అన్నారు. చంద్రబాబు లాంటి రాజకీయ ఉన్మాది దేశంలోనే లేడన్నారు. వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా చంద్రబాబు నిలిచాడన్నారు. గతంలో గోదావరి పురస్కరాలలో 29మందిని పొట్టనపెట్టుకున్నారని, కందుకూరులో 8మందిని బలికొన్నారని ఆవేదన వ్యక్తం చేసారు. జనవరి 1న గుంటూరు ముగ్గురు మహిళల ప్రాణాలను తీసారన్నారు. కుప్పంను అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహాన్‌రెడ్డిదే అన్నారు. సమావేశంలో వైకాపా ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వరప్రసాద్, ఆదిమూలం, వైకాపా సీనియర్ నేత రెడ్డివారి చక్రపాణి రెడ్డి, నియోజకవర్గాల పరిశీలకులు పాల్గొన్నారు.

## వైకుంఠ దర్శనం ఆనందదాయకం!

**రాష్ట్ర గవర్నర్ హరిచందన్**

తిరుమల,జనవరి 5ప్రభాతవార్తప్రతినిధి:



ధనుర్మాసంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని వైకుంఠద్వార దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని రాష్ట్రగవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. సామాన్యభక్తులకు టిటిడి చక్కటి దర్శన ఏర్పాట్లు చేసిందని తెలిపారు. గురువారం సాయంత్రం కుటుంబంతో కలసి గవర్నర్ హరిచందన్ వైకుంఠద్వార దర్శనం చేసుకున్నారు.

# చీకటి చట్టాలతో అడ్డుకోలేరు..

**సిఎం ఫ్రస్టేషన్‌లో ఉన్నారు : ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు - జగన్ పాలనపై వైకాపాలోనే వ్యతిరేకత. - తెదేపాకు అనూహ్య స్పందన !!**

కుప్పంరూరల్, జనవరి 5 ప్రభాతవార్త

సిఎం జగన్‌రెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉన్నారని తెలుగుదేశం పార్టీకి ప్రజలనుంచి వస్తున్న స్పందన చూసి చీకటి చట్టాలతో అడ్డుకోవాలని చూస్తున్నారని ప్రతిపక్ష నేత, తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంఎంమహల్, కెవిఆర్ కళ్యాణ మండపంలో నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తల శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ సిఎం జగన్ పాలనపై వైకాపాశ్రేణుల్లోనే వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ఇప్పటికే ఆ పార్టీ ఎమ్మెల్యేలు తమ అసంతృప్తిని బహిరంగంగా తెలియజేస్తున్నారన్నారు. మరో పక్క తాను రాష్ట్రంలో నిర్వహిస్తున్న సభలకు ప్రజలనుంచి అనూహ్య స్పందన వస్తుండడం చూసి సిఎం జగన్‌రెడ్డి పోలీసులతో అడ్డుకుని కేసులు నమోదు చేయిస్తున్నాడని పేర్కొన్నారు. చీకటి చట్టాలు తెచ్చి అడ్డుకోవాలని చూడడం అవివేకమన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీకి లేని ఆంక్షలు ప్రతిపక్షాలకే వర్తిస్తాయా అని ప్రశ్నించారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు మున్ముందు తగు గుర్తింపు ఇస్తామన్నారు. వైకాపా ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లో బలంగా తీసుకెళ్లి వారిలో చైతన్యం కలిగించాలని సూచించారు. పార్టీలో కష్టపడే వారికి మాత్రమే తాను ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి మూలాధారమని అలాంటి కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని చంద్రబాబు భరోసా కల్పించారు. అనంతరం నియోజకవర్గంలో చేపట్టిన పార్టీ కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు, ఓటర్ వెరిఫికేషన్ తదితరాలపై నేతలతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, కుప్పం పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా, రాష్ట్ర నేత గోపీనాథ్, నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.




కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రతిపక్ష నేత చంద్రబాబు , హాజరైన కార్యకర్తలు

## పెద్దిరెడ్డీ.. పుంగనూరులో చూస్తా

**సైకోలా తయారయ్యావా..మొన్న డబ్బులు పంచి గెలిచారు.. కుప్పంలో ఇప్పుడు రా..?**



కుప్పం, జనవరి 5 ప్రభాతవార్త

పెద్దిరెడ్డీ ఇది బిగినింగ్ మాత్రమే.. పుంగనూరులో నేనూ చూస్తా .. కుప్పంలో కార్యకర్తలను నేనే రెచ్చగొట్టానా.. సైకో జతలో ఉంటూ సైకోలా తయారయ్యావా అంటూ ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై విమర్శలు చేశారు. తాను గతంలో అనుకుని ఉంటే నువ్వు చిత్తూరు జిల్లాలో తిరిగేవాడివా అని ప్రశ్నించారు. పాలు నీకు మాత్రమే పోయాలా, ఇసుక, మైనింగ్‌లో ఎంత దోచావు.. కుప్పంలో 50కోట్లు కట్టమన్నారంట కదా అని ప్రశ్నించారు. తాను కుప్పంలో 35 ఏళ్లుగా గెలుస్తున్నానని మొన్న పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో డబ్బులు పంచి గెలిచారు.. ఇప్పుడు రా బట్టలిప్పిస్తాం అంటూ వ్యాఖ్యలు చేశారు.

# పేదలకు నాణ్యమైన వైద్యం...భగవంతుడికి చేసే సేవలతో సమానం

## గవర్నర్ హరిచందన్




ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, హాజరైన పలువురు ప్రముఖులు డాక్టర్లు

తిరుపతి నగరం, డిసెంబరు 5 ప్రభాతవార్త

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం అనేది భగవంతుడికి చేసే సేవలతో సమానమని ఏపీ రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. గురువారం మధ్యాహ్నం స్థానిక ఎస్వీ మెడికల్ అల్యూమినీ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీ శంకుస్థాపన, డాక్టర్ సుబ్రమణ్యం, సునీత, శ్రీధర్ రాజు, సుభాషిణి వారి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఆడిటోరియంను గవర్నర్ బిశ్వ భూషణ్ హరిచందన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ ఎస్వీ మెడికల్ కాలేజీ కొత్త ఆడిటోరియం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, హృదయపూర్వక శుభాకాంక్షలు అన్నారు. ఎస్వీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం మెడికల్ స్టూడెంట్స్ కోసం డిజిటల్ లైబ్రరిని ఏర్పాటు కోసం తన చేతులు మీదుగా పునాది వేయడం చాలా సంతోషంగా ఉందని, వివిధ సూపర్ స్పెషాలిటీలపై అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులను విజయవంతంగా నిర్వహించడం కోసం డాక్టర్ రాయపు రమేష్‌బాబు నేతృత్వంలోని ఎస్వీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు చేపట్టిన కార్యక్రమాలను అభినందిస్తున్నానని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హౌస్ సర్జన్ కూడా పూర్తి చేశారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. సూపర్ స్పెషాలిటీ సేవలు ఎంతో గొప్పగా ఉన్నాయని, అల్యూమిని అసోసియేషన్ వారి సేవలు చాలా బాగున్నాయని కొనియాడారు. తన చేతుల మీదుగా గతంలో 27 ఫిబ్రవరి 2022న ఇంటర్నేషనల్ న్యూరో సర్జరీ కాన్ఫెరెన్స్‌ను ప్రారంభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. వైద్యులు పేదలకు అందించే సేవలు ఎంతో ప్రాధాన్యత ఉందని, వారికి సమాజంలో గొప్ప బాధ్యత ఉందని, కోవిడ్ 19 విపత్తు సమయంలో ప్రధాన మంత్రి మోదీ ప్రజలను విపత్తు నుంచి కాపాడాల్సిన బాధ్యత మన వైద్యులపై మన అందరిపై ఉందని పిలుపునిచ్చారని అన్నారు. మానవ సేవయే మాధవ సేవ అని అన్నారు. కోవిడ్ 19 విపత్తు సమయంలో ఫ్రంట్ లైన్ వర్కర్స్ సేవలు ఎంతో గొప్పగా అందించడం వలన ఈ విపత్తు నుంచి మనం కోలుకోగలిగామని అన్నారు. మన దేశంలోని వైద్యులు అంతర్జాతీయంగా మంచి నైపుణ్యం కలిగి ఉన్నారని అన్నారు. చైనా దేశంలో నేడు నాలుగవ ఫేస్ కోవిడ్ 19తో ఎంతో మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, అక్కడ పరిస్థితి చేయి దాటిపోయిన పరిస్థితులలో మన దేశంలో మన వైద్య రంగం ఈ విపత్తును ఎదుర్కోనేందుకు అన్ని విధాలా సంసిద్ధంగా ఉందని ఎంతో గర్వంగా చెప్పగలుగుతున్నానన్నారు. తిరుపతి ఇంటర్నేషనల్ కార్డియాలజీ, సూపర్ స్పెషాలిటీ మెడిసినన్‌లో వివిధ రంగాలలో ఎస్వీఎంసీ పూర్వ విద్యార్థుల సంఘం జాతీయ, అంతర్జాతీయ సమావేశాలు నిర్వహించి దాదాపు 25 వేల మంది ప్రతినిధులు పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. పూర్వ విద్యార్థుల సంఘం అందరిచే గుర్తింపు పొందిందని, ఈ గొప్ప విజయం వెనుక ఉన్న డాక్టర్ రమేష్, టీమ్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, గవర్నర్ స్పెషల్ సీఎస్ఆర్పీ సిసోడియా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, ఎస్వీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఆర్. రమేష్‌బాబు, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్, రుయా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సురేశ్వర్‌రెడ్డి, ఎస్వీ మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థులు, డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు బట్టలు ఎప్పుడో ఊడిపోయాయి

**మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి**

సదుం,జనవరి 5 ప్రభాతవార్త



కుప్పంలో వార్డు మెంబర్లు నుంచి మునిసిపల్ ఎన్నికల వరకు అన్నిట్లోను ఓడిపోయిన చంద్రబాబునాయుడు నా బట్టలు ఊడదీయి స్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర విద్యుత్ అటవీ పర్యావరణ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురు వారం సదుం మండలం యర్రాతివారిపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్ని ఎన్నికల్లో ఓడిపోయిన చంద్రబాబుకు ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో ఎప్పుడో బట్టలు ఊడిపోయాయన్నారు.పుంగనూరు పుడంగి అని తనను విమర్శించిన చంద్రబాబుకు పుడంగి అంటే అర్థం ఏమిటో తెలుసా పుడంగి అంటే ఆయన కంటే బలవంతుడినే పుడంగి అంటారు.ఆయనే చెపుతున్నాడు కాబట్టి తాను ఆయన కంటే బలవంతుడిననే విషయం అర్థమయిందనుకుంటానన్నారు. కుప్పంలో ఘోరంగా ఓడిపోయిన నీవు పుంగనూరులో వచ్చి నువ్వు ఏమి చేస్తావని ఎద్దేవా చేశారు. మీతాతలు దిగివచ్చినా ఇక్కడ ఏమీ చేయలేరన్నారు. ఎన్టీఆర్ కుమార్తెను పెళ్లి చేసుకోకుండా ఉన్నా తెలుగుదేశం పార్టీ లేకుండా ఉన్నా చంద్రబాబు ఎమ్మెల్యేగా కూడా గెలిచేవాడు కాదన్నారు. తాను స్వయంగా రాజకీయాలలో రాణించానని ఆయన తనతో పోల్చుకోవడమేంటన్నారు. 1993 నుంచి తాను పాలవ్యాపారంలో ఉన్నానని చెప్పారు. ఆయన మాదిరి హెరిటేజ్‌లో ఉన్న షేర్లన్నీ కొనుక్కొని తన వాటాదారులను మోసం చేయలేదే అన్నారు. ఎవరు తక్కువ ధర ఇస్తున్నారో బహిరంగంగా తేల్చుకోవాలన్నారు. 2024 ఎన్నికల్లో కుప్పంలో వైకాపా గెలుస్తుందని అప్పుడు చంద్రబాబు బట్టలు పూర్తిగా ఊడిపోయి పిచ్చాసుపత్రిలో చేరడం ఖాయమన్నారు. ఇసుక, మైనింగ్‌లలో తాను డబ్బులు తీసుకుంటున్నానని ఆరోపించిన చంద్రబాబు గతంలో ఆయన తిరిగి ఇక్కడ అక్రమాలు జరుగుతున్నాయంటే తాము దాడులు చేసి వాటిని అరికట్టామని, జరిమానాలు వేశామని చెప్పారు. నువ్వు తిరిగి లబోదిబోమనడంతోనే వారంతా ఇప్పుడు వ్యాపారాలు మూసుకోవాల్సి వచ్చిందన్నారు. అదేవిధంగా మాకు కప్పంకట్టాలని చెపుతున్నావని నీదగ్గర మేము తీసుకోవాలా నీవు రాజకీయాల్లోకి వచ్చినప్పుడు రెండెకరాల భూమితో వచ్చావు ఇప్పుడు లక్ష కోట్లు ఎలా సంపాదించావో అందరికి తెలుసన్నారు. పీఎంకే ఉడా చైర్మెన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ ఎల్లప్పలు పాల్గొన్నారు.

## పుత్తూరులో పింఛన్లకు రూ. 3.52 కోట్లు

**మంత్రి రోజా**



పుత్తూరు, జనవరి 5 ప్రభాతవార్త :

పుత్తూరు మునిసిపాలిటీ, రూరల్ మండలం కలిపి మొత్తం రూ. 3.52 కోట్లకు పైగా పింఛన్ల రూపంలో ఇస్తున్నారని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా తెలిపారు. స్థానిక ఎంఆర్‌సి కార్యాలయ ఆవరణలో నూతన పింఛన్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుత్తూరు రూరల్ మండలంలో 1,05,79,500 రూపాయలను 3859 మందికి పింఛను ఇస్తున్నామన్నారు. మునిసిపాలిటీలో ఒక కోటి 65 లక్షల రూపాయలను 5458 మందికి ఇస్తుండగా, కొత్తగా 135 పింఛన్లు ఇస్తున్నామని తెలిపారు. చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి వెళ్లినా ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి రాష్ట్రాన్ని సమర్థంగా పరిపాలిస్తూ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎన్టీఆర్, వైఎస్సార్ తర్వాత ప్రజలను తమ బిడ్డలుగా తలచి ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న వ్యక్తి జగన్ మాత్రమేనని తెలిపారు. 14 ఏళ్ల అధికారంలో వున్న చంద్రబాబు పెన్షన్ కేవలం 75 రూపాయలు ఇచ్చేవారని తెలిపారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్లు డి.జయప్రకాష్, డి.శంకర్, కమిషనర్ కె.ఎల్.ఎన్.రెడ్డి, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరక్టర్ జ్యోతి, మెప్మా ప్రాజెక్ట్ డైరక్టర్ రాధమ్మ, ఎంపిపి మునివేలు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌యాదవ్, పలువురు అధికారులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## శివయ్యకు వేడినీళ్ళ అభిషేకం
## నటరాజుకు షోడషాభిషేకాలు

శ్రీకాళహస్తి,జనవరి 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరునికి నేడు వేడి నీళ్ల అభిషేకం నిర్వహించు టకు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే ఆలయంలో పరిచార కులచే 'అరికట్ల ఉత్సవం'నిర్వహించబడుతుందని ఆలయాధి కారులు గురువారం తెలిపారు. ఆరుద్ర సందర్భంగా శుక్రవారం వేకువ జామున ఉద్దిపిండితో శివలింగాన్ని ఏర్పాటు చేసి లింగానికి నేతి అభిషేకం నిర్వహించనున్నారు.ఈ అభిషేకానికి మహాశివరాత్రి పర్వదినానికి ఉన్నంత ప్రాధాన్యత ఉంటుంది. ఉదయం 6గంటలకు నిర్వహించే అభిషేక దర్శనం శివరాత్రి పర్వదిన దర్శనంతో సమానంగా భావిస్తారు. ఉద్ది పిండితో శివలింగాన్ని తయారు చేసి దానికి నేతితో అభిషే కిస్తారు.ఈ దర్శనం కోసం స్థానికులు తహ తహలాడతారు.ఈ ఏడాది శుక్రవారం వచ్చింది కాబట్టి ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందని చెబుతారు.ఉదయం 7గంటలకు నటరాజస్వరూపమైన శివయ్యకు ప్రత్యేక అభిషేకాలు గ్రామోత్సవం ఉంటుందన్నారు. తరువాత పరివార దేవతలకు నైవేద్యం ఉంటుందన్నారు. ఉదయం 9గంటలకు గొబ్బెమ్మ గ్రామోత్సవం ఉంటుందన్నారు. ఉదయం 10గంటలకు ద్వితీయ కాలాభిషేకం ఇందులో ఉష్ణోదక అభిషేకం మ ధ్యాహ్నం 2గంటలకు ఉచ్చికాలాభిషేకం, సాయంత్రం 5గంటలకు ప్రదోష కాలాభిషేకం, రాత్రి 8గంటలకు ఆరికట్ల ఉత్సవం తరువాత దర్శనం ముగింపు.ఈ నెల శుక్ర ఆలయంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల సందబర్బంగా ఆర్జిత సేవలన్నీ రద్దు చేయబడ్డాయని అయిత రాహుకేతుదోష నివారణ పూజలు యథావిధిగా ఉంటాయని ఇఓ వికె సాగర్‌బాబు తెలిపారు.





## డెంగ్యూ దడ

**- జిల్లాలో ఇప్పటికే నాలుగు కేసులు నమోదు**
**- పారిశుధ్య నిర్వహణ లోపం - ప్రజలకు శాపం**

చిత్తూరు, జనవరి 5 ప్రభాతవార్త:

జిల్లా ప్రజానీకంను డెంగ్యూ జ్వరాలు దడ పుట్టిస్తున్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పారిశుధ్య నిర్వహణ లోపం అధికంగా వుండటంతో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్నాయి. జిల్లాలో ఇప్పటికే నాలుగు డెంగ్యూ జ్వర కేసులు నమోదు అయ్యాయి. నగరి నియోజకవర్గంలో రెండు డెంగ్యూ జ్వర కేసులు నమోదు కాగా, చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, యాదమరి మండలంలో ఒకొక్క డెంగ్యూ జ్వర కేసు నమోదు అయ్యింది. నగరి నియోజకవర్గంలో బుగ్గ అగ్రహారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని రామాపురం గ్రామంలో ఓ వ్యక్తికి డెంగ్యూ జ్వరం రాగా, నగరి అర్బన్ ప్రాంతంలోని సత్రవాడ ఒరుగంటాపురం గ్రామంలో ఓ డెంగ్యూ కేసు నమోదు అయ్యింది. అలాగే చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంగనపల్లిలో 15 నెలల చిన్నారికి డెంగ్యూ జ్వరం సోకింది. అలాగే యాదమరి మండలం మోర్థానపల్లి గ్రామంలో ఓ డెంగ్యూ జ్వర కేసు నమోదు అయ్యింది. డెంగ్యూ జ్వరం పగటి పూట తిరిగే దోమ కుడితే వస్తోంది. ఈ దోమలు మంచి నీటి తొట్టెలు, ఇళ్ళలోని చేపల కుండీలు, రెఫ్రిజిరేటర్లు, నీటి నిల్వ కుండీలు, టైర్లలో నిల్వ వున్న వర్షపు నీరు, నీటి తొట్టెల్లో నిల్వ వున్న నీటిలో పెరిగే దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ జ్వర బారిన పడుతారు. దోమల కట్టడికి పక్కాగా చర్యలు తీసుకొంటే డెంగ్యూ జ్వరాలను అదుపు చేయడానికి అవకాశం వుంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా మలేరియా విభాగం అధికారులు క్షేత్ర స్థాయిలో నీటి నిల్వలు లేకుండా పక్కాగా చర్యలు తీసుకొంటే డెంగ్యూ జ్వరాలు అదుపులోకి వచ్చే అవకాశం వుంటుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమంను పక్కాగా అమలు చేస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పేర్కొంటున్నప్పటికీ ఈ కార్యక్రమం ఆశించిన స్థాయిలో జరుగడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నారు. డెంగ్యూ జ్వరాలపై ప్రజల్లో అవగాహన పెంచడం, క్షేత్ర స్థాయిలో వాలంటీర్లు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, సిహెచ్ఓలు, మలేరియా అధికారులు విస్తృతంగా పర్యటించి ఫ్రైడే డ్రైడే కార్యక్రమంను పక్కాగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా వుంది. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా వుంచడానికి స్థానిక ప్రజలు సైతం చర్యలు తీసుకోవాల్సి వుంటుంది. ఇళ్ళ పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవడం, నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం వంటివి పాటిస్తే డెంగ్యూ జ్వర కారక దోమలు వృద్ధి అయ్యే అవకాశం వుండదు.

## ఉగాది నాటికి 5 లక్షల ఇళ్ళ నిర్మాణాలు పూర్తి

**- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్**

చిత్తూరు, జనవరి 5 ప్రభాతవార్త: ఉగాది నాటికి 5 లక్షల ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసి లబ్దిదారులకు అప్పగించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి గురువారం కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ళ నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఈ మేరకు ఇళ్ళ నిర్మాణాలను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే రబీ సీజన్‌లో సైతం ఈ-క్రాప్ బుకింగ్ కార్యక్రమంను వంద శాతం పూర్తి చేయాలన్నారు. అర్హత వున్న రైతులందరికీ ఈకెవైసి, ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి చేసి రానున్న రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మైక్రో ఇరిగేషన్‌కు సంబంధించి డ్రిప్ పరికరాల ఏర్పాటు పారదర్శకంగా చేపట్టి పూర్తి చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల ద్వారా వచ్చే అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజా ప్రతినిధులు సూచించిన పనులను సత్వరం పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం చిన్న పిల్లల నుండి గర్భిణీ స్త్రీల వరకు వైద్యం విషయంలో అత్యంత ప్రాదాన్యత ఇస్తోందని, మంచి పోషక విలువలు వున్న ఆహారం ద్వారా గర్భంలో వున్న బిడ్డకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అలాగే రహదారులకు సంబంధించి ఎక్కడైనా స్థలాలు ఇవ్వాల్సి వుంటే వాటిని సత్వరం ఇచ్చి రహదారుల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అలాగే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించడానికి వార్డు, గ్రామ సచివాలయ సిబ్బందికి సరైన అవగాహన కల్పించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరినారాయణన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలి...జీఓ నంబర్ 1 ప్రతులు దగ్ధం







తిరుపతి,జనవరి 5ప్రభాతవార్త: భారత రాజ్యాంగంలో ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలు చేసే తప్పులు, అక్రమాలు, అవినీతిని బహిరంగ సభల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్ళి చైతన్యవంతుల్ని చేసే ప్రతి పక్షపార్టీల నాయకులకు హక్కు ఉందని, అలాంటిది ప్రతిపక్షాలగొంతునొక్కేలా వైసిపి ప్రభుత్వం జిఓ నంబర్ 1 తీసుకురావడం హాస్యాస్పదమని తెలుగు దేశం పార్టీ శ్రేణులు తప్పుపట్టాయి. పాలనచేతగాని అధికార వైసిపి ప్రభుత్వం జిఓ నంబర్ 1 వెంటనే ఉపసంహరించుకోవాలని తెలుగుదేశం నేతలు డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వానికి పతనం మొదలైందనీ, జిఓను వెంటనే వెనక్కు తీసుకో వాలని ప్లకార్డులతో నినాదాలు చేశారు. ప్రత్యేకంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి వి.పుష్పావతి యాదవ్ ప్లకార్డుతో నిరసన ప్రభుత్వాన్ని ఆలోచన చేసేలా ఉంది. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలో టిడిపి రాష్ట్ర, జిల్లా నాయకులు సుగుణమ్మ, నరసింహ యాదవ్, సూరాసుధాకర్‌రెడ్డి, పుష్పావతి యాదవ్, ఆర్‌సి మునికృష్ణ, ఊకా విజయకుమార్, సింగంశెట్టి సుబ్బ రామయ్య, దంపూరి భాస్కర్, ఊట్ల సురేంద్రనాయుడు, వట్టికుంట చిన్నబాబు, కృష్ణయాదవ్, మహేష్‌యాదవ్ ,కంకణాల రజినీకాంత్‌నాయుడు, ఆనందగౌడ్, తులసీరామ్, బ్యాంకు శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ లే అవుట్‌లలో స్టేజీలవారీగా కన్వర్షన్ నిర్మాణాలను పూర్తి

**-గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మంజూరైన పనులపై ప్రత్యేక దృష్టి - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి**

**-ఈ పంట నమోదు పక్రియ ఫిబ్రవరి 20లోపల పూర్తి చేయాలి -జె.సి. డికె.బాలాజీ**

తిరుపతిరూరల్, జనవరి 5 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ంగా ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులపై ప్రత్యేక దృష్టిపెట్టి పూర్తి చేసేలా చూడాలని సి.ఎస్ జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం అమరావతి నుండి సంబంధిత కార్యధ్ములతో వర్చువల్ విధానంలో రీ సర్వే, ల్యాండ్ అక్విజేషన్, హౌసింగ్, వ్యవ సాయం, స్పందన, గడప గడపకు మన ప్రభుత్వం అంశాలపై సమీక్ష నిర్వహించగా కలెక్టరేట్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ సంబంధిత అధికారులతో హాజరయ్యారు. అనంతరం జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఈ-పంట నమోదు పక్రియను జనవరి 20 తేదీ లోపు పూర్తి చేసేలా చూడాలన్నారు. పి.ఎం.కిసాన్ సంబంధించి ఈకెవైసి ప్రక్రియను జనవరి 15వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి నవరత్నాలు పేదలందరికి ఇళ్లు పథకంలో భాగంగా ఈ ఉగాదికి 5లక్షల ఇళ్ళు నిర్మాణాలు పూర్తి అయ్యేలా ప్రత్యేక శ్రద్ద పెట్టి పూర్తి చేసేలా చూడాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాల ప్రక్రియలో భాగంగా స్వయం సహాయ మహిళలకు 30వేల రుపాయాలు మంజూరు చేసేలా చూడాలన్నారు. స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరిం చాలని, బియాండ్ ఎస్.ఎల్.ఎ.కి వెళ్ళకుండా నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. వైయస్సార్ చేయూత పథకంలో భాగంగా స్వయం సహాయక మహిళల జీవనోపాధి కోసం రుణాలను మంజూరు చేసేలా కృషి చేయాల న్నారు. ఈ సమావేశంలో డిఆర్వో శ్రీనివాసరావు, డిఎల్‌డిఓ సుశీలాదేవి, డ్వామా పిడి శ్రీనివాసప్రసాద్, జిల్లా ప్లానింగ్, స్టాటికల్ అధికారి అశోక్ కుమార్, హార్టికల్చర్ డిడి దశరధ రామిరెడ్డి, ఎడి సర్వేయర్ జయరాజ్, డిపిఓ రాజశేఖర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌బాబులు పాల్గొన్నారు.

## 15,47,258 మంది ఓటర్లు

**- తుది ఓటర్ల జాబితా-2023 విడుదల చేసిన కలెక్టర్ హరినారాయణన్**

చిత్తూరు, జనవరి 5 ప్రభాతవార్త: ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణలో భాగంగా తుది ఓటర్ల జాబితా-2023ను కలెక్టర్ హరినారాయణన్ గురువారం విడుదల చేశారు. ఈ మేరకు జిల్లాలో 15,47,258 మంది ఓటర్లు వున్నారని, ఇందులో మహిళలు 7,77,839, పురుషులు 7,69,306, థర్డ్ జెండర్ 113, సర్వీస్ ఓటర్లు 3,528 మంది వున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఎవరైనా 18 సంవత్సరాలు పూర్తయి వుంటే ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవచ్చునన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో 1,17,171 మంది పురుష ఓటర్లు, 1,19,223 మహిళా ఓటర్లు, 19 థర్డ్ జెండర్, 404 సర్వీస్ ఓటర్లు వుండగా, నగరి నియోజకవర్గంలో 1,00,062 పురుష, 1,04,152 మహిళా, 7 థర్డ్ జెండర్, 144 సర్వీస్ ఓటర్లు వుండగా, జిడినెల్లూరు నియోజకవర్గంలో 1,02,604 పురుష, 1,02,249 మహిళ, 9 థర్డ్, 499 సర్వీస్ ఓటర్లు వున్నారు. అలాగే చిత్తూరు నియోజకవర్గంలో 99,436 పురుష, 1,01,867 మహిళ, 45 థర్డ్ జెండర్, 919 సర్వీస్ ఓటర్లు, పూతలపట్టు నియోజకవర్గంలో 1,09,644 పురుష, 1,10,196 మహిళ, 13 థర్డ్ జెండర్, 1,112 సర్వీస్ ఓటర్లు, పలమనేరు నియోజకవర్గంలో 1,29,067 పురుష, 1,30,412 మహిళ, 248 సర్వీస్ ఓటర్లు, కుప్పం నియోజకవర్గంలో 1,11,322 పురుష, 1,09,740 మహిళ, 20 థర్డ్ జెండర్, 202 సర్వీస్ ఓటర్లు వున్నారు.

## శివయ్యసేవలో లెఫ్టినెంట్ జనరల్



శ్రీకాళహస్తి,జనవరి 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరుని సేవలో గురువారం లెఫ్టినెంట్ జనరల్ డెప్యూటీ చీఫ్ ఆర్మి రవిన్‌కౌశల్ కుటుంబసభ్యులతో పాల్గొన్నారు. వారికి ప్రోటోకాల్‌మేరకు దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఓ వికెసాగర్‌బాబు ఆదేశాలతో ఎఇఓ సతీష్‌మాలిక్ స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల సన్నిధిలో అంతరాలయ దర్శనం ఏర్పాటుచేసారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వారికి వేదపండితు లతో ప్రత్యేకాశీర్వచనాలు అందించి స్వామి అమ్మవార్ల తతీర్ధ ప్రసాదాలు, స్వామిఅమ్మవార్ల చిత్రపటాలను అందించారు.ఏర్పాట్లను పిఆర్‌ఓ సురేష్‌రెడ్డి, ఎపిఆర్‌ఓ మణిలు పర్యవేక్షించారు.

## కుప్పం సంఘటనలపై డిజిపికి చంద్రబాబు లేఖ

**- జిల్లా ఎస్పీ.. పలమనేరు డిఎస్పీలపై ఫిర్యాదు**

కుప్పం, జనవరి 5 ప్రభాతవార్త : తన కుప్పం పర్యటనలో భాగంగా బుధవారం శాంతిపురం మండలంలో చోటు చేసుకున్న సంఘటనలపై రాష్ట్ర డిజిపికి ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు లేఖ రాశారు. ప్రధానంగా జిల్లా ఎస్పీ, పలమనేరు డిఎస్పీలపై లేఖలో ఫిర్యాదు చేశారు. తన పర్యటన సందర్బంగా వాడే ప్రచార రథాన్ని, మైక్ వాహనంను అక్రమంగా గుడుపల్లె పోలీస్‌స్టేషన్‌కు తరలించారన్నారు. తన కుప్పం పర్యటనపై ఇదివరకే తన కార్యదర్శి మనోహర్ డిఎస్పీకి వివరాలు అందించారని అయితే వాటికి అంగీకరించలేదన్నారు. అనంతరం గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం, ఇబ్బందులు తలెత్తకుండా గ్రామసభలు జరుపుకుంటామని వివరాలు అందిస్తే వాటికి అనుమతులు లేవని పేర్కొన్నారన్నారు. తన వాహనాలను వెనక్కు తెప్పించి ఇస్తామని డిఎస్పీ వాహనాలు అప్పగించలేదని లేఖలో పేర్కొన్నారు. 121 పెద్దూరు ప్రాంతంలో తనను దాదాపు మూడు గంటల పాటు రోడ్డుపై నిలిపేశారన్నారు. జిల్లా ఎస్పీ, పలమనేరు డిఎస్పీలు తమ విధులను న్యాయబద్ధంగా నిర్వర్తించలేదని వారిపై తగు చర్యలు తీసుకోవాలని చంద్రబాబు లేఖలో పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంరక్షణకు పక్కా చర్యలు : కలెక్టర్

చిత్తూరు, జనవరి 5 ప్రభాతవార్త: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంరక్షణకు అత్యంత పక్కాగా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ హరినారాయణన్ ఐసిడిఎస్ పిడి నాగశైలజ, సిడిపిఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో కలెక్టర్ వైఎస్ఆర్ న్యూట్రిషియన్ కిట్, ప్రీస్కూల్ ఫిజిషియన్ ఆక్టివిటీ, 0-3 సంవత్సరాల మధ్య పిల్లల ఆరోగ్య పరిస్థితులు, పిల్లలు, గర్భిణీ స్త్రీలకు ఇస్తున్న న్యూట్రీషియన్ ఫుడ్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజిషియన్‌లో భాగంగా గ్రామాలకు వస్తున్న డాక్టర్ల వద్దకు ఎంత మంది వెళ్ళి చికిత్స చేసుకొంటున్నారనే వివరాలు అడిగి తెలుసుకొన్నారు. అలాగే ఇళ్ళను సందర్శించే సంఖ్యను మరింత పెంచాలన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన చంద్రబాబు



శాంతిపురం, జనవరి 5 ప్రభాతవార్త: మాజీ ఎమ్మెల్యే దివంగత రంగ స్వామి నాయుడు సోద రుడి కుమారుడె నంది గం శాంతలక్ష్మి దేవరాజు లు నాయుడు కుమార్తె మనోజ్ఞ శ్రావణి, యువ రాజ్ చౌదరి దంపతు లను శాంతిపురంలోని వారి స్వగృహంలో ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ఆశీర్వదించారు. ఈసందర్బ ంగా వారి కుటుంబ యోగక్షేమాలను చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాణిపాకం దువ్వులూరి భాస్కర్‌రావు, చిట్టెమ్మ, హేమావతమ్మ, ఆదినారాయణనాయుడు, సరసమ్మ, సుగుణమ్మ, రాధాకృష్ణనాయుడు, ఉదయ్‌కుమార్, నందిగం కుటుంబీకులు పాల్గొన్నారు.

## నన్ను అన్యాయంగా సస్పెండ్ చేశారు

**-ఉప ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు**




కాణిపాకం, జనవరి 5 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం ప్రధాన ఆలయం ఉప ఆలయమైన శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 13న స్వామివారికి ప్రత్యేక అభిషేకం జరుగకుండా ఆగిపోయిన సంఘటనపై తనకు ఎటువంటి సంభందం లేకపోయినా కుట్రపన్ని తనను అన్యాయంగా సస్పెండ్ చేశారని ఆలయ ఉప ప్రధాన అర్చకులు పరవస్తు శ్రీనివాసాచార్యులు అన్నారు. గురువారం ఆయన ఈఓ కార్యాలయం ముందు విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 13న ఆలయంలో స్వామివారికి అభిషేకం చేయలేదని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అభిషేకం నిర్వహించక పోవడానికి తన డ్యూటీకి ఎటువంటి సంబంధం లేదని, అప్పటి డ్యూటీ అర్చకుడైన హరీష్, పరిచారిక కళ్యాణరామన్‌దే పూర్తి బాధ్యతని తెలిపారు. ఆలయ ఈఓ ఎవరో మాటలు వింటూ నన్ను సస్పెండ్ చేశారని, తన సస్పెండ్ వెనుక పెద్ద కుట్ర జరుగుతూ వుందని శ్రీనివాససాచార్యులు తెలిపారు. తనకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం



రేణిగుంట, జనవరి 5 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌కు రేణిగుంట విమానాశ్రయంలో గురువారం ఘన స్వాగతం లభించింది. గవర్నర్‌తో స్పెషల్ సీఎస్‌ఆర్‌పీ సీసోడియా ఉన్నారు. వీరికి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, ఈఎంసీ క్లస్టర్ సీఈవో గౌతమి, ఏఎస్పీ కులశేఖర్, శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావు, గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్, ఎయిర్‌పోర్టు సీఎస్‌వో రాజశేఖర్, రేణిగుంట తహసీల్దార్ శివప్రసాద్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ స్పెషల్ కాన్వాయ్‌తో బాలాజీ ఆస్పత్రికి రోడ్డు మార్గంలో బయలుదేరి వెళ్లారు.

## పేద ప్రజల అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కె రోజా**



నింద్ర,జనవరి 5 ప్రభాతవార్త : పేద ప్రజల అబివృద్ధి సంక్షేమే వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ ద్యేయమని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కె రోజా తెలిపారు.గురువారం మండలంలోని కావనూరు గ్రామపంచాయితీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి వర్యులు ఆర్‌కె రోజా ప్రభుత్వ లబ్దిదారులకు కరపత్రాన్ని పంపిణి చేసారు. ఈసందర్బంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి ఓటువేసిన వారికి వేయని వారికి ప్రతి ఒక్కరికి వివిధ పథకాల రుపంలో సహాయం అందజేస్తున్నరని తెలిపారు.గతంలో రాష్ట్రంలో పరిపాలన చేసిన నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామిలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసారని విమర్శించినారు. రాష్ట్రంలో వైయస్ కాంగ్రెసు పార్టీ ప్రభుత్వం ఏర్పాడి మూడు సంవత్స రాలలో వైకాపా ప్రభుత్వం ఇచ్చిన వాగ్దనాలలో 98శాతం అమలు చేసిన ఘనత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతు ందని తెలిపారు. కులం, మతం, ప్రాంతం,పార్టీలకు ఆతీతంగా ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రజలకు అందజేస్తున్నారని అన్నారు. విద్యార్థుల భవిషత్ దృష్టిలో వుంచుకొని విద్యాభివృద్ధి కోసం నాడు నేడు,జగనన్న గోరుముద్ద,వంటి పథకాలతో దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని వంటి సంక్షేమ పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో తహాశీల్దారు అమరేంద్రబాబు, యంపిడిఓ వేణు,యంపిపి దీపాజలంధర్‌రాజు,మండల వైకాపా కన్వీనర్ వేణురాజు,సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్టా రెడ్డి, రాష్ట్ర వైకాపా యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్,కో ఆప్షన్ మెంబరు అనిల్,యంపిటిసి విజేష్,నింద్ర సర్పంచ్‌లు వసంత్‌బాబురెడ్డి,గౌరి,నాయకులు మేరీజయ రామ్, మహేష్, గిరి, తోయజాక్షి, వీరయ్యానాయుడు, సంపత్‌కుమార్,నామాదేవిరెడ్డిలు పాల్గొన్నారు.

## మంత్రి రోజాకు సన్మానం



పుత్తూరురూరల్, జనవరి 5 ప్రభాతవార్త: పుత్తూరు రూరల్ ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా మంత్రి రోజాను నగరిలోని స్వగృహంలో శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పుత్తూరు మార్కెటింగ్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, నాయకులు రాజా, దాసు, హేమాద్రిలు ఉన్నారు.

## ఓటర్ల తుది జాబితా మేరకు... తిరుపతి జిల్లా 17,27,576 మంది ఓటర్లు

**- జిల్లాలో పురుష ఓటర్లు-8,47,343, మహిళ ఓటర్లు-8,79,992,ట్రాన్స్‌జండర్-241**

**- తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి**

తిరుపతిరూరల్, జనవరి5 ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలో ప్రత్యేక ఓటర్ల సవరణ-2023 మేరకు 17,27,576 మంది ఓటర్లు ఉన్నట్లు తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో తుది ఓటర్ల జాబితాను కలెక్టర్ విడుదల చేసారు. ఎన్నికల కమిషన్ ఆదేశా మేరకు జిల్లాలో అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో, పోలింగ్ కేంద్రాలలో ఓటర్ల తుది జాబితాను అందు బాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ప్రత్యేక ఓటర్ల తుది జాభితాను తయారీకి తమవంతు కృషి చేసిన అధికారులను అభినందించారు. గూడురు నియోజకవర్గంలో పురుష ఓటర్లు -1,17,583, మహిళ ఓటర్లు-1,21,522, ట్రాన్స్‌జెండర్స్-47 మంది, సూళ్ళూరుపేట నియోజకవర్గంలో పురుషుల ఓటర్ల సంఖ్య-1,13,304, మహిళ ఓటర్లు-1,18,432, ట్రాన్‌జెండర్స్-45మంది. వెంకటగిరి నియోజక వర్గంలో పురుష ఓటర్లు-1,13,510, మహిళ ఓటర్లు-1,18,432, ట్రాన్స్‌జెండర్స్-02మంది. చంద్రగిరి నియోజకవర్గంలో పురుష ఓటర్లు-1,41,302, మహిళ ఓటర్లు-1,47,513, ట్రాన్స్‌జెండర్స్-64మంది. తిరుపతి నియోజకవర్గంలో పురుష ఓటర్లు-1,43,785, మహిళ ఓటర్లు-1,44,290, ట్రాన్స్ జెండర్స్-48మంది, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పురుష ఓటర్లు-1,17,039, మహిళ ఓటర్లు-1,23, 719, ట్రాన్స్ జెండర్స్-20మంది. సత్యవేడు నియోజకవర్గంలో పురుష ఓటర్లు-1,00,820, మహిళ ఓటర్లు-1,05,935, ట్రాన్స్‌జెండర్స్ 15 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో పురుష ఓటర్ల సంఖ్య కంటే మహిళ ఓటర్లు 32,649 మంది అధిక్యంలో ఉన్నారు.

## సిఐటియు రాష్ట్ర కౌన్సిల్‌లో ఏడుగురు తిరుపతివాసులు!

తిరుపతి ప్రెస్‌క్లబ్,జనవరి 5 ప్రభాతవార్త: సిఐటియు రాష్ట్ర మహాసభలు భీమవరంలో ఈనెల 2,3,4 తేదీలలో ఘనంగా జరిగాయి.ఈ మహాసభల్లో రాష్ట్ర కౌన్సిల్ నూతన కమిటీని ఎన్నుకున్నామని, ఇందులో తిరుపతి వాసులు ఏడుగురికి చోటు దక్కడం గొప్ప విషయమని సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రహ్మణ్యం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కందారపు మురళి,తనలతో పాటు అంగేరి పుల్లయ్య,జి.వెంకటేశం,ఆర్.లక్ష్మి,ఎస్.వాణిశ్రీ,రాష్ట్ర కమిటీ సభ్యులుగా, ర.వేణుగోపాల్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారని ఆయన వివరించారు.

## టిటిడి ఇఓ ధర్మారెడ్డిని ఓదార్చిన గవర్నర్



తిరుమల,జనవరి 5ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటే శ్వర స్వామి దర్శనార్థమ్ గురువారం సాయంత్రం తిరుమల పద్మావతి విశ్రాంతిభవనం వద్దకు గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ విచ్చేశారు. ఇటీవల ఇఓ ధర్మారెడ్డి కుమారుడు గుండెపోటుతో కన్నుమూయడం, తీవ్ర మనో వేదనతో ఉన్న ధర్మారెడ్డిని గవర్నర్ ఓదార్చారు. కొద్దిసేపు పద్మావతి విశ్రాంతిభవనంలో ఇద్దరూ చర్చించుకున్నారు.

## గవర్నర్ బిశ్వభూషణ్‌కు బిజెపి నేతల సన్మానం



తిరుపతి,జనవరి 5ప్రభాతవార్త : ఒక్కరోజు తిరుపతి,తిరుమల పర్యటనలో గురువారం మధ్యాహ్నం తిరుపతి పద్మావతి విశ్రాంతి భవనం చేరుకున్న గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌కు బిజెపి నాయకులు సాదర స్వాగతం పలికారు. ఇక్కడ బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, అక్కినపల్లి మునికృష్ణయ్య యాదవ్, సుబ్రమణ్యంయాదవ్,కవిత, సుబ్రమణ్యంరెడ్డి, మల్లారపు రవిప్రసాద్ పుష్పగుచ్ఛమిచ్చి, శ్రీవారి చిత్రపటం బహుకరించారు.

### గవర్నర్ బిశ్వభూషణ్‌కు సాదర స్వాగతం



ఒక్కరోజు తిరుపతి,తిరుమల పర్యటనలో గురువారం మధ్యాహ్నం తిరుపతిపద్మావతి విశ్రాంతి భవనం చేరుకున్న గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌కు సాదర స్వాగతం పలికారు. తిరుపతి జెఇఓ సదాభార్గవి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

## ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు - వీరిపై 89 కేసులు

**31 ఎర్రచందనం దుంగలతో పాటు కారు స్వాధీనం**




రేణిగుంట, జనవరి 5 ప్రభాతవార్త: పలు జిల్లాలో దాదాపు 89 కేసులు నమోదైన వాంటెడ్ ఎర్రచందనం స్మగ్లర్ బ్రదర్స్ అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్సు ఎస్పీ కె.చక్రవర్తి తెలిపారు. వీరి నుంచి 31 ఎర్రచందనం దుంగలు, ఆరు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వీరిద్దరిని కడప జిల్లా చాపాడు మండలానికి చెందిన షేక్ చెంపతిలాల్ బాషా(36), షేక్ చంపతి జాకీర్(27)లుగా గుర్తించినట్లు తెలిపారు. వీరిద్దరు సోదరులని, వీరు గత కొన్ని సంవత్సరాలుగా ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిపారు. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారన్నారు. వీరి కోసం కొంత కాలంగా చేపట్టిన వ్యూహం ప్రకారం అరెస్టు చేసినట్లు తెలిపారు. డీఐజీ సెంథిల్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్పీ చక్రవర్తి ఆధ్వర్యంలో సీఐ రామకృష్ణ, ఆర్ఐ చిరంజీవుల టీములుగా ఏర్పడి ఏర్పేడు సమీపంలోని కృష్ణాపురం, మల్లెమడుగు, కరకంబాడి ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. కరకంబాడి ఫారెస్టు బీట్ అమరరాజా ఫ్యాక్టరీ విన్జియో కంపెనీ వద్ద కారుతో నిలబడి ఉన్న వీరిని గమనించారు. వీరిని సమీపించడంతో పారిపోవడానికి ప్రయత్నించారు. ఆర్ఎస్ఐ రాఘవేంద్ర మరికొంత మంది పోలీసులు చుట్టుముట్టి పట్టుకోగలిగారు. వీరి నుంచి 31 ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం చేసుకున్నారు. కారులో పోలీసు యూనిఫాంను కూడా కనుగొన్నారు. వీరు పోలీసు యూనిఫాం వేసుకుని స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను హైజాక్ చేసి ఇతర రాష్ట్రాలకు అమ్మేవారని తెలిపారు. 31 ఎర్రచందనం దుంగలు విలువ రూ.20 లక్షలు ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐలు చంద్రశేఖర్, బాలకృష్ణ, రామకృష్ణ, ఎఫ్‌ఆర్‌వోలు, ఎస్ఐ పాల్గొన్నారు. ఆపరేషన్‌లోపాల్గొన్న వారికి ఎస్పీ రివార్డులు ప్రకటించారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : డిప్యూటీ సిఎం

పెనుమూరు, జనవరి 5 ప్రభాతవార్త: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకై సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని డిప్యూటీ సిఎం నారాయణస్వామి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో ఆయన లబ్దిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా పేదలను ఆదుకోవడానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని అన్ని హామీలను నెరవేర్చి పేద కుటుంబాలకు పెద్ద దిక్కుగా సిఎం వుండి 1వ తేదీనే పెన్షన్లు అందిస్తూ పేదల పక్షపాతిగా సిఎం నిలిచారన్నారు. రాష్ట్రంలో 64 లక్షల మందికి పెన్షన్లు అందించడం జరుగుతుందని, గత ప్రభుత్వ హయాంలో పెన్షన్లు రావాలంటే లబ్దిదారులు మృతి చెందితే కాని కొత్త పెన్షన్లు మంజూరు అయ్యేది కాదన్నారు. మాజీ సిఎం చంద్రబాబునాయుడు పేదల సంక్షేమం విస్మరించారని, ఆయన పాలన అవినీతిమయంగా వుండటంతో గత ఎన్నికల్లో ప్రజలు తగిన శాస్తి చెప్పారన్నారు. ప్రస్తుతం మాజీ సిఎం చంద్రబాబునాయుడు తన బినామీల కోసం పోరాటం చేస్తున్నారని ప్రజల కోసం ఏ మాత్రం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శివయ్య, తహసిల్దారు విజయభాస్కర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, వైకాపా నాయకులు దూది మోహన్, విజయకుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, యశోదారెడ్డి తదితరులు పాల్గొన్నారు.